# అనామకుని ఆకలి



అలపర్తి రామకృష్ణ

నేల ఈనిందా అన్నట్లుగా జనం —— బహిరంగ సభ జరిగే గ్రౌండ్స్ కేసి ఊరేగింపు సాగిపోతూ వుంది.

కట్టలు తెంచుకున్న జనవాహిని మధ్య చిక్కుకు పోయి దీనంగా నడుస్తున్నాడు అభిమన్యు.

రెండు రోజుల నుంచి తిండి లేక పీక్కు పోయిన మొహం, మురికి పట్టిన బట్టలు, చేతిలో పార్టీ పతాకం — తప్పి పోయిన మనిషిలా వున్నాడు.

ఏడేళ్ళ క్రితం మరో పార్టీ జెండా పట్టుకుని అదే రోడ్డు మీద వీరావేశంతో నడిచేడు. 'దారి పొడుగునా గుండె నెత్తురులు తర్పణ చేస్తూ పదండి ముందుకు... పదండి త్రోసుకు పోదాం పైపైకి' కదం తొక్కుతూ, పదం పాడుతూ ఊరేగింపు అగ్రభాగాన నడిచేడు.

''పేదరికం రూపుమాపుతాం!'' అని బహిరంగ సభలో నాయకులు అనగానే చేతులు నొప్పులు పుట్టేలా చప్పట్లు కొట్టాడు.

చప్పట్లుకొట్టిన చేతుల్లోకి పిడికెడుబియ్యంరాలలేదు.

ఆ పార్టీని వొదిలి మరో పార్టీ జెండా పట్టుకుని ఆవేశంతో వూగిపోయాడు.

''పోట్స్ కెన్ ఛేంజ్ ది రూలర్స్.... బట్ నాట్ ది ఫేట్ ఆఫ్ ది రూలుడ్''అని తెలుసుకున్నాడు చివరికి.

అభిమన్యు బి.ఏ. పాసయ్యాడు. ఉద్యోగం దొరక్క చివరికి హోటల్లో సప్లయిర్‌గా కుదిరేడు. ఆ 'బి.ఏ' డిగ్రీ ఆ ఉద్యోగాన్ని కూడా సరిగ్గా చెయ్య నివ్వలేదు. హోటల్ యజమానులకు ఎదురు తిరగటం నేర్పింది. ఊళ్ళో వున్న హోటల్స్ అన్నిటిలో పని చేశాడు.

వారం రోజుల్నుంచి ఏ హోటల్లోనూ పని దొరక్క ఖాళీగా వున్నాడు. ఆకలి రాజ్యం సభ్యుడయ్యాడు.

అభిమన్యుకి పాటలు పాడటం వొచ్చు.

చేతికి జెండా యిచ్చి లారీ ఎక్కించేశారు.

లారీ నగరం చేరుకున్నాక అందరూ భోజనానికి వెళ్ళితే, అభిమన్యు మాత్రం లారీ లోనే గుర్రు పెట్టి నిద్ర పోయాడు.

నిద్రలేచేక తన వూరి వాళ్ళతో ఊరేగింపులో నడవాల్సి వొచ్చింది. అతని భోజనం గూర్చి పట్టించు కున్నవాళ్ళు లేరు.

ఊరేగింపులో నడుస్తున్నాడే గాని మనస్సు ఎక్కడో పరిభ్రమిస్తూ వుంది......

ఊళ్ళో అమ్మ చల్లటి చేతుల్తో —

అరిటాకు వేసి ——————

పులిహోర, పప్పు, పులుసు, నెయ్యి, పాయసం, మీగడ పెరుగు దగ్గరుండి వడ్డిస్తోంది ———

అబగా తినేస్తున్నాడు తను...........

పులుసులో ములక్కాడ కాబోలు గొంతుకు అడ్డంగా............

ఊపిరాడక మెలికలు తిరిగి పోయాడు......

చెదిరిపోయింది కల ——————

అమ్మ, అరిటాకు ఫేడేట్ అయ్యాయి...... ఆఖరికి పగటి కలలో కూడా దురదృష్టం వెంబడించింది. జనం అభిమన్యుని ముందుకు నెట్టారు.

''తెలుగు గడ్డ జిందాబాద్!'' అరుస్తున్నారు జనం ఆవేశంగా

''తెలుగు ఆకలి జిందాబాద్!'' అరవాలనిపించింది అభిమన్యుకు.

కడుపులో ఎర్రని ఆకలి మంటలు ———

ఎంతకూ చల్లారని వెర్రి మంటలు ———

ఆ మంటలు తాత్కాలికంగా ఆర్పాలంటే చల్లటి నీళ్ళు చల్లాలి

దాహం..... దాహం.... గొంతు ఎండుకు పోతూ వుంది.

ఊరేగింపులో నుండి తప్పుకుని ప్రక్క సందులోకి దూరేడు మంచినీళ్ళ కోసం

ఎదురుగా మున్సిపాలిటీ వాళ్ళ టాప్.

నీళొస్తున్నాయి... ఆ రోజు కనికరించిందా తెలుగు గంగ....

రెండు గుక్కలు నీళ్ళు తాగేడో లేదో తెలుగు గంగ ఆగిపోయింది. కేంద్రం అడ్డుపుల్ల వేసిందో ఏమో!

ఆరేళ్ళ కుర్రాడు అతని వైపు చూస్తున్నాడు

ఆ కుర్రాడిని చూసి నవ్వేడతను.

కుర్రాడి చూపులు అతను పట్టుకున్న జెండాపై పడ్డాయి.

అతని చూపులు ఎత్తుగా వున్న కుర్రాడి లాగు జేబుపై పడ్డాయి.

"ఏమిటవి?"

"వేరుశెనక్కాయలు"

"ఈ జెండా ఇస్తాను గాని వేరుశెనక్కాయలు పెడతావా?" జీవితంలో మొదటిసారిగా పతనమవటానికి సిద్ధమయ్యాడు అభిమన్యు. ఆకలి ఏ పనినైనా చేయిస్తుంది.

ఆ కుర్రాడికి ఆకర్షణీయంగా వున్న జెండా కావాలి! వాడి బలహీనతని సొమ్ము చేసుకోవాలనుకున్నాడు.

ఆనందంగా ఆ కుర్రాడు జేబులోనుంచి వేరుశెనక్కాయలు అతని చేతిలో పోశాడు.

క్షీరసాగర మథనంలో వెలువడ్డ అమృతంలా వున్నాయి వేరుశెనక్కాయలు.

ఆ కుర్రాడు మోహిని లా కన్పించేడు.

మోహిని దగ్గర నుండి అమృత కలశాన్ని లాక్కుని పరుగెత్తె రాక్షసుడిలా అక్కడి నుండి పరుగెత్తి ఊరేగింపులో కలిసి పోయాడు అభిమన్యు.

సిగ్గుతో తలవొంచుకుని నడవడం మొదలు పెట్టాడతను.

అదే మొదటిసారి తప్పు చేశాననే భావంతో తలొంచుకోవడం.

..... ఛీ ..... ఛీ వెధవ బ్రతుకు .... ఆకలి మంటలు తీర్చుకోవడానికి చిన్న పిల్లవాడిని మోసం చెయ్యాల్సి వొచ్చింది.....

మొదటి చిన్న తప్పు చెయ్యడమే చాల కష్టం

ఆ తర్వాత ఎంత ఘోరమైనా చెయ్యొచ్చునని పించిందతనికి

అతని శరీరంలో వొణుకు తగ్గింది

నిర్భయంగా తలెత్తి చూశాడు.

రోడ్డు ప్రక్కన నిలబడి ఊరేగింపు చూస్తున్న చిన్ననాటి మిత్రుడు కన్పించేడు అభిమన్యుకు.

హోటల్‌కు వెళ్ళి టీ త్రాగారిద్దరూ. బాల్యం మధురిమలను తిరగేసుకున్నారిద్దరూ.

"విజయవాడలోనే బ్యాంక్‌లో పని చేస్తున్నాను మిత్రమా..... ఊరేగింపు చూద్దామని వొచ్చాను.... పర్సు ఎవరో కొట్టేశారు" అన్నాడు అభిమన్యు ఈసారి తలొంచకుండానే

పది రోజుల్లో తిరిగి పంపుతానని మిత్రుడి దగ్గర వంద రూపాయల కాగితం తీసుకున్నాడు అభిమన్యు.

*******

అభిమన్యు దగ్గర నుండి మనియార్డరు కోసం ఎదురు చూస్తూనే వున్నాడు అతని మిత్రుడు

ఐదేళ్ళు గడిచి పోయాయి.... కొత్త ప్రభుత్వం వొచ్చింది..... మనియార్డరు రాలేదు...... ●

# శుభం! శుభం! జన్మదినం

సెప్టెంబర్ 5 నుండి 11వ లోపల పుట్టిన రోజు జరుపుకునే ప్రియపాఠకులూ అందుకోండి! ఉదయం నవతరం వార పత్రిక శుభాకాంక్షలు.



జి.రాజ్ కుమార్,
పుట్టిన తేదీ: 6.9.89
హైదరాబాద్



పి.పద్మావతి,
పుట్టిన తేదీ: 7.9.89
రామచంద్రాపురం



కె.సంధ్య,
పుట్టిన తేదీ: 8.9.89
వంపాపేట



డి.స్వప్న,
పుట్టిన తేదీ: 9.9.89
నెల్లట్ల



కె.మంజుబాయి,
పుట్టిన తేదీ: 10.9.89
గౌలిపురా



ఎస్.ఖాదర్ వల్లి,
పుట్టిన తేదీ: 11.9.89
పటాన్ చెరువు



—కె.వాసవి,
పుట్టిన తేదీ: 5.9.89,
హైదరాబాద్

సెప్టెంబర్ 12 నుండి సెప్టెంబర్ 18వ తేదీ లోపల పుట్టినరోజు జరుపుకునే ప్రియ పాఠకులూ... మీ ఫోటోతోపాటు ఈ కూపన్ జతపరచి పంపండి. ప్రచురిస్తాం.

జన్మదిన పాఠక విజేతలకు ఉదయం నవతరం వారపత్రిక అభినందనలు.

**కూపన్**

పేరు: ____________

పుట్టినతేదీ: ____________

చిరునామా: ____________

సంతకం: ____________